క్లుప్తంగా

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విద్యార్థుల ప్రతిభ


వర్షిత్‌రెడ్డి


మహేశ్వరి

కురవి: సీరోలు మండలం కాంపల్లి గ్రామానికి చెందిన సుంకి రెడ్డి వర్షిత్‌రెడ్డికి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆలిండియా 1280వ ర్యాంకు సాధించాడు. ఆదివారం వెలువడిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించాడు. కాంపల్లి గ్రామానికి చెందిన సుంకిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి–స్నేహలత కుమారుడు వర్షిత్‌రెడ్డి హనుమకొండలో ఎస్సెస్సీ, ఇంటర్ హైదరాబాద్‌లో చదివాడు.

కురవి: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కాలేజీకి చెందిన విద్యార్థిని భూక్య మహేశ్వరికి జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో 1,6504వ ర్యాంకు, ఎస్టీ కేటగిరీలో 107వ ర్యాంకు వచ్చినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ మార్త సంతోష్ తెలిపారు.

ప్రమాణ స్వీకారానికి ఆహ్వానం



కేసముద్రం: ప్రధాన మంత్రి మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి, ప్రధానమంత్రి కార్యాలయ ఆదేశాల మేరకు దూరదర్శన్ ఢిల్లీ నుంచి ఆహ్వానపత్రం అందినట్లు మండలంలోని నర్సింహులగుడెంజీపీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కొడిపాక రమేష్ తెలిపాడు.

గార్ల వాసికి..

గార్ల: ప్రధాని నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారానికి గార్లకు చెందిన బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఆర్.విమల్‌కుమార్ జైన్‌కు ఆహ్వాన పత్రిక అందడంతో ఆదివారం ఆయన ఢిల్లీకి వెళ్లారు.

రక్తదాన శిబిరం



మహబూబాబాద్ రూరల్: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ప్రభుత్వ జనరల్ జిల్లా ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ బానోత్ జగదీశ్వర్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మార్వాడి సత్రంలో మార్వాడి యువమంచ్, సఖి మండలి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ లోయ, పున్నంచంద్ మాల్పాని, విజయ్ ప్రకాష్ లోయ, దామోదర్ ఝువర్, సఖి మండలి రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ కలంత్రి, రాజకుమారి లోయ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మరిపెడ: మండలంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మినీ గురుకులం బాలికల సంక్షేమ హాస్టల్‌లో 2024–25 సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి ఏవీ రాజ్యలక్ష్మీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటో తరగతి ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాలకు 6సంవత్సరాల వయసు కలిగిన బాలికలు అర్హులన్నారు. ఒకటో తరగతిలో 30 సీట్లు, 2నుంచి 5వ తరగతి వరకు బ్యాక్‌లాక్ ఖాళీలను కూడా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వివరాలుకు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సెల్ నంబర్ 93811 53893 సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని కొత్త బజారులో ఫీడర్‌పై ఉన్న చెట్ల కొమ్మల నరికివేత కారణంగా నేడు సోమవారం ఉదయం 7గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ నవ్యశ్రీ ఆదివారం తెలిపారు. పులిగోపాల్‌నగర్, ఇన్‌కేబుల్ కాలనీ, రెడ్డి బజారు, మార్వాడిసత్రం, కురవిరోడ్, సలార్‌తండా, అయ్యప్పనగర్, కవిత కాలనీ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

మహబూబాబాద్ రూరల్: మండలంలోని అమనగల్ సబ్‌స్టేషన్ నిర్వహణ, మరమ్మతు పనుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ భోజ్యా నాయక్ ఆదివారం తెలిపాడు. అమనగల్, ఎక్స్‌ప్రెస్ ఫీడర్, శనిగపురం, వావిలాల, నర్సింహులగూడెం 11 కేవీ ఫీడర్లకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అమనగల్, వావిలాల, గుండాలగడ్డ తండా, బోరింగ్ తండాలల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

నియామకం

పాలకుర్తి టౌన్: తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా పాలకుర్తికి చెందిన డాక్టర్ మేడారపు సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర చైర్మన్ కోటూరి మానవతారాయ్ నియామకం పత్రాన్ని ఆయనకు ఆదివారం అందజేశారు తనకు పదవి వచ్చేందుకు సహకరించిన నాయకులు నాగరాజు, నరేష్, వినోద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కాడెడ్లకు తగ్గని ఆదరణ

- యంత్రాలు పెరిగిన నాగళ్లకు తగ్గని గిరాకీ
- విత్తనాలు వేయడంలో ప్రాధాన్యం


పత్తి విత్తలను విత్తేందుకు చెలుకను దున్నుతున్న రైతు

పెద్దవంగర: ఖరీఫ్‌లో వ్యవసాయ సాగు ప్రారంభమైంది. రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. యాంత్రీకరణ పెరిగిన నేపథ్యంలో వ్యవసాయంలో ఎన్ని యంత్రాలు వచ్చినా.. కాడెడ్లకు మాత్రం గిరాకీ తగ్గడం లేదు. విత్తనాలు వేయడంలోనూ కలుపు నివారణకు దంతె తోలడంలోనూ.. ఇవి లేకుంటే పని ముందుకు సాగదు. వ్యవసాయంలో దుక్కిదున్నడం మొదలు పంట ఇంటికి వచ్చే వరకు యంత్రాల వినియోగం పెరిగింది. అయినప్పటికీ కాడెడ్ల అవసరం మాత్రం తప్పడం లేదని రైతులు అంటున్నారు. వానకాలం సీజన్‌లో అన్నింటికంటే ముందుగా పత్తి విత్తనాలు విత్తుతారు. పత్తిని విత్తే సమయంలో సాళ్లు పట్టాలన్న, కలుపు నివారణకు దంతే కట్టాలన్నా, నారుమళ్లలో గొర్రు తిప్పాలన్నా, ఎడ్ల అవసం తప్పనిసరైంది.

తగ్గిన కాడెడ్ల సంఖ్య

గతంలో మారుమూల గ్రామాల్లోని ప్రతి ఇంట్లో నాలుగైదు జతల ఎద్దులతోపాటు ఎడ్లబండ్లు ఉండేవి. ప్రస్తుతం చాలా వరకు తగ్గిపోయాయి. యంత్రసాగుకు రైతులు మొగ్గు చూపడంతో రైతుల ఇళ్ల ముందు ట్రాక్టర్లు కన్పిస్తున్నాయి. మొదటి దుక్కులకు మొత్తం అన్నదాతలు ట్రాక్టర్ల సాయంతోనే మొత్తం పూర్తి చేస్తున్నారు. అచ్చు దున్నడం మొదలు అంతర పాట్లు చేసే సమయంలో మాత్రమే ఎద్దుల అవసరం ఉంటుంది. గ్రామాల్లో పశుపోషణకు అయ్యే ఖర్చు, వాటి ఆలనాపాలనా చూసుకోవడం కష్టంగా మారింది. ప్రత్యేకంగా ఓ మనిషిని కేటాయించే పరిస్థితిలేక చాలా మంది ఎడ్లను విక్రయించి ట్రాక్టర్లను కొంటున్నారు.

డిమాండ్ పెరిగింది

పత్తి, మిరప మొక్కల మధ్య దంతె కట్టాలంటే ట్రాక్టర్లతో వీలుకాదు. వీటితో చదును చేస్తే మొక్కలు విరడం, టైర్లకింద పడి ధ్వంసం అవుతాయి. వానాకాలంలో చెలుకలు బురదమయంగా ఉంటాయి. ఆ సమయంలో ట్రాక్టర్లతో పని చేయాలంటే వీలు కాదు. ఇలాంటి సమయంలో కాడెడ్లతోనే పనులు చేయాల్సి ఉంటుంది. నాట్లు వేసే సమయంలో గొర్రు కట్టాలన్నా కాడెడ్ల అవసరం ఎంతో ఉంది. కాగా మండలంలోని పలు గ్రామాల్లో యంత్రాల వినియోగం పెరిగి కాడెడ్లు కనుమరుగవడంతో పశువులు ఉన్న వారికి డిమాండ్ పెరిగింది. అరకను అద్దెకు తీసుకొంటే రోజుకు రూ.1200 నుంచి రూ.1500 వరకు చెల్లించాల్సి వస్తోంది.

పశుపోషణ భారంగా మారింది..



పశువుల సంరక్షణ భారంగా ఉంది. కాల్వ నీళ్లు వస్తుండడం, వర్షాలు సైతం అధికంగా కురవడంతో రైతులు తమ వద్ద ఉన్న భూమిని సాగు చేస్తున్నారు. మేపేందుకు ఖాళీ స్థలం లేక అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొన్ని పనులు అరకతోనే చేయాలి. దీంతో అద్దెకు తీసుకోవాల్సి పరిస్థితి ఏర్పడింది. పశు సంపదపై పాలకులు, ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపాలి.

– జాటోతు దామోదర్, రైతు, ఆర్పీతండా

ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు


మహబూబాబాద్ రూరల్: బడిబాటలో మాట్లాడుతున్న బద్రినారాయణ

మహబూబాబాద్ రూరల్: బడిబాటలో భాగంగా మాధవాపురం గ్రామంలోని తూర్పు తండా, సీసీతండా, చెవులతండాలో ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం బద్రినారాయణ మాట్లాడుతూ.. బడి బయట విద్యార్థులను, ప్రైవేట్ స్కూల్ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సౌకర్యాలు ప్రధానంగా ఉచితంగా యూనిఫాం, మధ్యాహ్న భోజన పథకం అమలు, నోట్ పుస్తకాలు, డిజిటల్ తరగతులతో విద్యాబోధన మంచి నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్నేహలత, సుజాత, సౌభాగ్య, దుర్గయ్య, నాగరాణి, వీరలక్ష్మి, శైలజ, కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇంగ్లిష్‌లో మీడియంలో ఉచిత ప్రవేశాలు కల్పిస్తామని ఈదులపూసపల్లి ఎంపీపీఎస్ హెచ్‌ఎం సోమ గోవర్ధన్ అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి లక్ష్మపురం తండా, లాక్య తండాలో బడిబాట ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఉచిత భోజనం, యూనిఫాం, పుస్తకాలు, టై, బెల్ట్‌లు ఉచితంగా అందజేస్తామన్నారు. ఆరుగురు విద్యార్థులకు అడ్మిషన్లు అందించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణు, గోపాల్, గోవర్ధన్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు అపూర్వ స్పందన


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

డోర్నకల్: డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న రెండు రాష్ట్రాల కబడ్డీ పోటీలకు క్రీడాకారుల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఖాజాభాయ్ మెమోరియల్ పేరుతో ఏర్పాటు చేసిన టోర్నమెంట్‌లో తెలంగాణ నుంచి మహబూబాబాద్, ఖమ్మం, నల్లగొండ, కరీంనగర్ తదితర జిల్లాలు, ఆంధ్రా నుంచి ప్రకాశం, విజయవాడ, గుడివాడ తదితర ప్రాంతాల క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు భీమనబోయిన సంతోష్, కొడవండ్ల యాదగిరి, చెట్టుపల్లి ఉప్పలయ్య, తోట ప్రసాద్, పగిడిపల్లి రామకృష్ణ, శ్రీనివాస్, గొడుగు సురేష్, చందా మహేష్, బి.సాగర్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఫీజుల దోపిడీని అరికట్టాలి



తొర్రూరు: మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

తొర్రూరు: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు గుగులోతు సూర్యప్రకాశ్ అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు చేస్తూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్నారు. విద్యాహక్కు చట్టానికి ప్రైవేటు పాఠశాలలు తూట్లు పొడుస్తున్నాయన్నారు. పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా 25శాతం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అమీర్, జ్యోతిబసు, గుండ్ల రాకేష్, ద్రావిడ్, చరణ్, వినయ్ పాల్గొన్నారు.

గార్ల: ప్రైవేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నందున, ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని పీడీఎస్‌యూ మండల కార్యదర్శి ఎం.మహేష్‌కుమార్ డిమాండ్ చేశాడు. ఆదివారం గార్లలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేయడంతోపాటు, పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, టై, బెల్ట్‌లు, అడ్మిషన్లు ఫీజుల పేర దోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాగరాజు, ఆకాష్, చింటు, పృథ్వీ, తదితరులు పాల్గొన్నారు.

బిర్సముండాకు ఘన నివాళి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ పోరాట యోధుడు బిర్స ముండా వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైరా మాజీ శాసన సభ్యులు చంద్రావతి, హైకోర్టు సీనియర్ న్యాయవాది జోగు రామ్‌నాయక్, ఉపాధ్యాయులు శివనాయక్, కిషన్‌నాయక్, ప్రభాకర్, వీరు నాయక్ పాల్గొన్నారు.

11న విద్యుత్ పరిష్కార వేదిక

తొర్రూరు: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11న పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ గుట్టయ్య తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైభవంగా ఆలయం ప్రారంభం


సుధాగని దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని దర్గాతండా జీపీ పరిధిలోని రేగడిగూడెం గ్రామంలో హనుమాన్ దేవాలయ ప్రారంభోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. మానుకోట ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సుధాగని మురళికవిత దంపతులు, వారి కుమారులు దినేష్, పవన్ కల్యాణ్ తమ సొంత ఖర్చులతో హనుమాన్ ఆలయాన్ని నిర్మించి ప్రారంభించారు. అర్చకులు గణేష, రుద్ర, చండీహోమాలు జరిపి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, గుగులోత్ బాలు, రావుల గోవర్ధన్ రెడ్డి, పర్శిక ముత్తయ్య, సుధాగాని నరేష్, గీసగాని శ్రీను, చెట్ల రామన్న, దొంతు లక్ష్మణ్, లావుడ్య సీతారాం, భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్మాణకర్తలు సుధాగని మురళికవిత దంపతులను గ్రామస్తులు, స్థానికులు ఘనంగా సన్మానించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గార్ల: 1983-84 బ్యాచ్ విద్యార్థులు

గార్ల: గార్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983–84 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 40 ఏళ్ల తర్వాత పాఠశాలలో ఒకే వేదికపై కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మహేష్, దుర్గాప్రసాద్, రాఘవేంద్రరావు, బుడాన్, లక్ష్మినారాయణ, భాస్కర్, సుందర్‌కుమార్, రామారావు, దయాకర్, భద్రు, నీరజ, భారతి, ఉషారాణి పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక డీడీ హైస్కూల్ 1983–84 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్థానిక డీడీ డిగ్రీ కళాశాల ఆవరణలో ఘనంగా జరిగింది. ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. 40 ఏళ్ల తరువాత కలిసిన మిత్రులు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

సంబురాలు

బయ్యారం: పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న గెలుపును హర్షిస్తూ మల్లన్న టీం సభ్యుల ఆధ్వర్యంలో బయ్యారంలో సంబురాలు జరిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వీరారెడ్డి, రాందాస్, సత్తిరెడ్డి, వెంకట్‌రెడ్డి, లింగయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాలపై విచారణ జరపాలి

బయ్యారం: నీట్ ఫలితాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరపాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతగాని రాకేష్ డిమాండ్ చేశారు. ఆదివారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్డీఏ ప్రభుత్వం నిర్వహించిన నీట్ రాతపరీక్ష ఫలితాల్లో అవకతవకలు జరిగాయని విద్యార్థులు, తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఫలితాల్లో 62 మందికి పూర్తిస్థాయి మార్కులు రావటం అనుమానాలకు బలం చేకూరుతుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు వంశీ, అభిరామ్, అరుణ్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం పోరాడాలి


మాట్లాడుతున్న యాకాంతంగౌడ్

కేసముద్రం: సర్వాయి పాపన్న స్ఫూర్తితో రాజ్యాధికారమే లక్ష్యంగా గౌడ కులస్తులు పోరాడాలని కొండిన్య గౌడ సంఘం మండల అధ్యక్షుడు చిర్రయాకాంతంగౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని అమీనాపురం గ్రామంలో జరిగిన సంఘం 17వ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌడ కులస్తులంతా ఐకమత్యంతో ఉండాలని, అన్నిరంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి చీకటి వెంకట్రాంనర్సయ్య, ఉపాధ్యక్షుడు తండా వెంకన్న, సహాయ కార్యదర్శులు సామకూరి నర్సయ్య, బొగ్గుల నాగయ్య, చింతనూరి వెంకన్న, చీకటి వేలాద్రి, మోడెం రవీందర్, మల్లేశం, వెంకన్న పాల్గొన్నారు.


బాధిత కుటుంబాలకు పరామర్శ


కేసముద్రం: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామంలో కొండ్రెడ్డి రాంరెడ్డి, కేసముద్రంస్టేషన్‌లో ఆంగోతు వీరన్న, ఇనుగుర్తి మండల కేంద్రంలో రాంరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు ఆదివారం బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే మురళీనాయక్ పరామర్శించి, ఓదార్చారు. అదేవిధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంతో తీవ్రంగా గాయపడిన మాజీ సర్పంచ్ గుగులోతు వెంకన్న వరంగల్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, అతడి వద్దకు ఎమ్మెల్యే వెళ్లి, పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు తెలిపారు. ఆయన వెంట పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, కేసముద్రం, ఇనుగుర్తి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, కూరెల్లి సతీష్, ధన్నసరి సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, కదిర సురేందర్, దయాకర్, తదితరులు ఉన్నారు.

పెద్దవంగర: మండలంలోని రెడ్డికుంట తండాకు చెందిన బానోతు భిచ్యా నాయక్ (78) ఇటీవల మృతి చెందాడు.ఆదివారం టీపీసీసీ మాజీ సభ్యులు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకలు మామిడాల తిరుపతి రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

హామీలను అమలు చేయాలి


మాట్లాడుతున్న పొమ్మయ్య

బయ్యారం: ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సనప పొమ్మయ్య అన్నారు. మండలంలోని గంధంపల్లి–కొత్తపేటలో ఆదివారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2లక్షల రైతుల రుణాలు మాఫీ చేయటంతోపాటు రైతులు పండించిన అన్ని రకాల ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ అందించాలన్నారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి పుల్లన్న, సహాయ కార్యదర్శి మదార్, నాయకులు షర్ఫుద్దీన్, ఉపేందర్, కోటమ్మ, భాస్కర్, వెంకటేశ్వర్లు, సర్వయ్య, శ్రీను, ఎల్లయ్య, జయరాజు, బక్కయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నోట్‌బుక్స్ పంపిణీ

గార్ల: మండలంలోని పుల్లూరు గ్రామంలో నిరుపేద విద్యార్థులకు కీసర పద్మాకర్‌రెడ్డి సుధ దంపతులు ఆదివారం ఉచితంగా నోట్‌బుక్స్, పెన్నులను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు.

సన్మానం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం బాల్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని తావుర్య బాపూజీ తండాకు చెందిన గుగులోతు నవీన్ సీఏ, సీఎంఏ పూర్తి చేశాడు. ఇటీవల నవీన్‌కు గేల్ ఇండియా లిమిటెడ్‌లో ఏడాదికి రూ.23లక్షల ప్యాకేజీ పొందుతున్నారు. మారు మూలతండాకు చెందిన నవీన్ ఇంత పెద్ద మొత్తంలో ప్యాకేజిని పొందుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న నవీన్‌ను మహబూబాబాద్ జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ సభ్యుల జర్పుల కాలునాయక్ ఆధ్వర్యంలో బాల్యతండా తండా వాసులు ఆదివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జిక్కినారాయణ, మాజీ ఉపసర్పంచ్ హరినాయక్ పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

నర్సింహులపేట: మండలంలోని కౌసల్యదేవిపల్లి గ్రామంలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఎస్సై సతీష్ కథనం ప్రకారం.. కౌసల్యదేవిపల్లి గ్రామంలో బైరోజు సుజాత అనే వృద్ధురాలి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెల తాడు, బత్తిని రవి ఇంట్లో పడి ఒక తులం బంగారం ఎత్తుకెళ్లారు. సుజాత అనే వృద్ధురాలు అరవడంతో ఆమె తలపై కొట్టి దొంగలు పరారయ్యారు. తలకు గాయం కావడంతో చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రెండు ఇళ్లలో 4తులాల బంగారం అపహరణకు గురికావడంతో ఆదివారం బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక


మధు, అధ్యక్షుడు

కేసముద్రం: ఇనుగుర్తి మండల గౌడ కౌండిన్య సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా ఇనుగుర్తికి చెందిన కూటికంటి మధు ఎన్నికయ్యారు. ఆదివారం సంఘం సమావేశం జరిగింది. మండల ప్రధాన కార్యదర్శిగా గండి అశోక్, కోశాధికారి వేముల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా శ్రీను, కార్తీక్, అజయ్, శ్రీకాంత్, మధు, సంయుక్త కార్యదర్శులను ఎన్నుకున్నారు.

'లోఓల్టేజీ సమస్య ఉండదు'

గార్ల: గార్ల పట్టణంలో నాలుగు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినందున ఇక నుంచి లోఓల్టేజీ సమస్య ఉండదని విద్యుత్ ఏఈ మహేంద్రబాబు తెలిపారు. ఆదివారం గార్ల పట్టణంలో నాలుగు చోట్ల నాలుగు కొత్త 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఫోర్‌మెన్ సాంబమూర్తి, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది నరేష్, రవి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

భగవంతుడి ఆరాధనతో ధర్మస్థాపన

మహబూబాబాద్ రూరల్: భగవంతుడి ఆరాధనతో ధర్మస్థాపన జరుగుతుందని త్రైతసిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక మహబూబాబాద్ కమిటీ అధ్యక్షుడు కృష్ణవేణి అన్నారు. మండలంలోని కంబాలపల్లి గ్రామంలో ఆదివారం భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వీరస్వామి, రజిత, హేమ, నవ్య శ్రీ, హేమశ్రీ, పద్మ, నిరోషా, హర్షవర్ధన్, ఆర్యవర్ధన్, విగ్నేష్, శ్రీసాయి, బన్నీ, చిన్మయ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ ఎంపీపీ మృతి

మరిపెడ రూరల్: మండలంలోని ఎల్లంపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గండి బాబు (65) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి రాథోడ్ సత్యవతి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్, నాయకులు నూకల నరేష్‌రెడ్డి, గుడిపూడి నవీన్, తదితరులు నివాళులర్పించారు.

బీరన్న ఆలయ వార్షికోత్సవం

గూడూరు: మండల కేంద్రంలోని యాదవ నగర్‌లో కురుమ గొల్ల కులస్తుల ఆరాధ్య దైవమైనన బీరన్న, అక్కమహంకాళి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు.

భూమి విరాళంగా అందజేత



కేసముద్రం: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో గల శ్రీశివకోటేశ్వరస్వామి ఆలయానికి గాను, ఇదే గ్రామానికి చెందిన పాల్వాయి రాజేశ్వర్‌రెడ్డి 3గుంటల భూమిని కొనుగోలు చేసి విరాళంగా ఆదివారం అందజేశాడు. ఈమేరకు అట్టి భూమి పత్రాలను ఆలయ కమిటీకి అందజేశాడు. కార్యక్రమంలో పాల్వాయి లక్ష్మారెడ్డి, మనోహరదేవి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



కురవి: మండలంలోని కందికొండ గ్రామానికి చెందిన నీలారపు ఉపేందర్ అనే రైతుకు చెందిన రెండు గేదెలు ఆదివారం మేత కోసం ఊరిబయటకు వెళ్లాయి. తెగిపడిన తీగలు తగిలి విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధిత రైతు ఉపేందర్ తెలిపాడు.

బీజేపీ శ్రేణుల సంబురాలు



మహబూబాబాద్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల్లో అంఖడ విజయం సాధించి మూడోసారి కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వ ఏర్పడి ప్రధానిగా మోదీ ప్రమాణస్వీకారం చేస్తున్న క్రమంలో జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్‌లో బీజేపీ శ్రేణులు టపాసులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేసి సంబురాలు చేశారు. ఈసందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యాప సీతయ్య, పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ 8పార్లమెంట్ సీట్లు సాధించిందని, రాబోయే రోజుల్లో 2029లో తెలంగాణలో బీజేపీ ఘన విజయాలు సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్యామ్‌సుందర్ శర్మ, మోసంగి మురళి, పసుపులేటి నవీన్‌నాయుడు, పద్మ, రాధపటేల్, ఇందుభారతి, నాగమణి, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.